

# ధర్మపాలుడు

అది బ్రిటిష్ హయాం.

మున్సబు హనుమయ్య పేరు చెబితే వూరంతా వొణికిపోయి చేతులు కట్టుకు నుంచునేవారు. ధ్వజ స్తంభంలా ఏడడుగుల మనిషి. నల్లటి నలుపు. విచ్చుకున్న పత్తికాయల్లా తెల్లటికళ్ళు. అందులో ఎర్రజీరలు. పొంగిన బుగ్గలమీద ఇరుప్రక్కలా వింజామరల్లా పరుచుకున్న బుంగమీసాలు. హనుమయ్య ఒక చేత్తో మీసం సవరించుకుంటుంటే చెంపంతా నిమురు కుంటున్నట్టుండేది. ఆజానుబాహువైన హనుమయ్య ఒక చేత్తో పంచెకొంగు పట్టుకుని మరో చేత్తో పొన్ను కర్ర వేసుకుంటూ పెద్దబజార్న నడచి వస్తుంటే బజారంతా గప్‌చుప్

అయిపోయేది. వేపచెట్టుకింద పేకాటగాళ్ళు పారిపోయేవాళ్ళు. అలుపు తీర్చుకోవటం కోసం బండి ఆపిన ముఠాకూలీలు గబగబా లేచి బండి తోసుకుపోయేవారు. చిల్లర కొట్లలో తూకాలు దగా లేకుండా తూచేవారు. కొసరడిగితే విసుక్కోకుండా బెల్లంముక్క పెట్టేవారు. జనం పక్కలకి తప్పుకుని గొంతులు తగ్గించి మాట్లాడుకునేవారు. ముందు వెట్టివాళ్ళు నడుస్తుండగా హనుమయ్య అలా బజార్లోంచి వెళ్తుంటే వూరంతా నిశ్శబ్దమైపోయినట్లుండేది.

సర్కారువారి దృష్టిలో హనుమయ్యకు గొప్ప పలుకుబడి. ఆ పరగణాలో ఎక్కడన్నా శిస్తు బకాయి ఉంటుందేమో కాని హనుమయ్య హయాంలో బకాయి ఉండేది కాదు.

హనుమయ్య శిస్తువసూలు చిత్రంగా ఉండేది. చదువుకున్నవాళ్ళు, పెద్దవాళ్ళ దగ్గర వసూలు కొచ్చాడనుకోండి, వచ్చి సరాసరి వరండాలో కూర్చునేవాడు "ఏమండీ! పున్నయ్యగారూ! నన్నీవూళ్ళో వుండమంటారా వెళ్ళిపొమ్మంటారా? చెప్పండి మీరే చెప్పండి? అప్పా కాసిని మజ్జిగియ్యమ్మా దాహంగా ఉంది" అని ఇంట్లోకి కేకేసి "పైవాడు నాకు వుచ్చులు బిగిస్తుంటే నేను చచ్చిపోతున్నాను మీరేమో శిస్తు కట్టరు. ఈపూట కట్టకపోతే నా భోజనం ఇక్కడే" అని మఠం వేసేవాడు. దాంతో పున్నయ్యగారు నవ్వుకుని శిస్తుకట్టి భోజనానికి ఉండమంటే హనుమయ్య నవ్వుతూ లేచి "సరేలే, ఇంకా వసూళ్ళు లేవూ?" అంటూ వెళ్ళిపోయేవాడు. ఇక మామూలు రైతుదగ్గర కొచ్చి "సన్నాసి ముండా కొడకల్లారా! సర్కారు శిస్తు మానేస్తార్రా? కడుపుకు తింటున్నాం మనకు నీతి లేదంట్రా!" అని సిగ్గు పడేట్లు చీవాట్లు పెట్టి శిస్తు వసూలు చేసేవాడు. తను బతికుండగా తన వూళ్ళో న్యాయం తప్పటానికి వీల్లేదనే వాడు. ఒకసారి చలమయ్య తన గేదెల్ని కావాలని రామయ్య బీట్లోకి మేతకి తోలాడు. రామయ్య వచ్చి

హనుమయ్యకి చెప్తే వెంటనే ఆ గేదెలని బందెలదొడ్లో పెట్టించాడు. సాయంత్రమైంది. చలమయ్య వచ్చి గొల్లున గోల. "తప్పయింది బాబూ! నా బర్రెల్నిడిపించండి బాబూ! పాల వేళయింది. పాలు తీసి అమ్ముకుంటే గాని రేపటికి నూకలుండవు బాబూ!" అని హనుమయ్య కాళ్లావేళ్లా పడ్డాడు. "తప్పుడు పని చేసేప్పుడు ఈ బుద్ధి ఏయిందిరా?" అని హుంకరించి వెట్టివాళ్ళని పిలిచి "ఆ గేదెల పాలు తీసి మనింట్లో ఇవ్వండ్రా" అన్నాడు హనుమయ్య.

చలమయ్యకి ఆ మర్నాడు గేదెల్ని అప్పగిస్తూ 'నీతిగా బతకరా దొంగెదవ. ఇదుగో నిన్నటి పాల డబ్బులు' అని రొక్కమిచ్చి పంపించాడు.

ఒకసారి ముత్తాలమ్మ కొలువులో దొంగతనం జరిగింది. బలిచ్చిన వేటల్ని సమానంగా వాటాలు పంచుకున్నారు. తీరా తీసుకెళ్ళేటప్పుడు చూస్తే ఒక వాటా తక్కువయింది. ఎవరో దొంగతనం చేశారు. వెతకండన్నారు. పందిళ్ళన్నీ గాలించారు. మూట చంకన పెట్టుకుని పారిపోతున్న దొంగని పట్టుకున్నారు. వాడు పారుగూరి పోలయ్య, పోలయ్యని పెడ రెక్కలిరగదీసి హనుమయ్య దగ్గరికి తీసుకొచ్చారు.

"ఎందుకు చేశావురా దొంగతనం?" ఉరిమినట్లు అడిగాడు హనుమయ్య.

"తప్పయిందయ్యా! మాంసం వండుకొందామనుకున్నానయ్యా" అన్నాడు తలొంచుకుని పోలయ్య!

"అయితే దొంగతనం చేస్తావంట్రా. నీతి తక్కువ కొడకా! వాణ్ణి చెట్టుక్కట్టి పొద్దునే వొదిలేయండ్రా" అని తీర్పు చెప్పాడు.

హనుమయ్యకి రాత్రంతా నిద్ర పట్టలేదు. పొద్దునే పోలయ్యని విడిపించి "స్నానం చేసి రారా" అని చెప్పి తనింట్లో మాంసంతో భోజనం పెట్టించి "ఒరేయ్! తిండిమీద కోరికుంటే దొంగతనం కాదురా చెయ్యాల్సింది. పనిచేసి

సంపాదించుకు తినరా! ఫో" అని పంపేశాడు.

కొంతకాలానికి కరువొచ్చింది. పంటలు పండలేదు. పచ్చటి పొలాలు నెర్రెలు విచ్చిపోయాయి. రైతులు కొందరు వలస పోయారు. తినటానికి గింజలు లేవు. పశువులకి గడ్డిలేదు. వరన్నం తినేవాళ్ళు జొన్న రొట్టెలు తింటున్నారు. కాని సర్కారు వారు శిస్తు వసూలు సక్రమంగా జరగవలసిందే అని పట్టుబట్టారు. హనుమయ్య దొడ్డ చిక్కులో పడిపోయాడు. నయానా భయానా ఎట్లా వసూలు చేసినా శిస్తు చాలా బకాయి ఉండి పోయింది. పై అధికారులకు కోపం వచ్చింది. కట్టనివాళ్ళ ఆస్తులు జప్తు చెయ్యమన్నారు. హనుమయ్య కళ్ళ నీళ్ళతో ఆస్తులు జప్తు చేశాడు. చెంబూ తప్పాలా వీధిలో వేయించాడు. వేలం పాడించాడు. కాని కొనేవాడేడి? శిస్తు బకాయి పూడలేదు. పై వాళ్ళకి మరీ కోపం వచ్చింది. బకాయి ఉన్న రైతుల్ని చెట్లకు కట్టేసి పాతిక దెబ్బలు కొట్టమని హుకుం వచ్చింది. ఈ సంగతి తెలిసి కొందరు పారిపోయారు. పొద్దున్నే రెవెన్యూ ఇన్స్పెక్టరు వచ్చాడు. రైతుల్ని ఓ ఇరవై మందిని చింతల తోపులోకి తీసుకొచ్చారు. అందర్నీ చెట్లకి కట్టేస్తున్నారు. హనుమయ్య దగ్గరుండి కట్టిస్తున్నాడు. అందరూ అయిపోయారు. తను ఇంకో చెట్టుకానుకు నుంచుని "నన్ను కట్టెయ్యరా" అన్నాడు. "బాబూ!" అంటూ వెట్టివాడు కాళ్ళమీద పడ్డాడు. "కట్టెయ్యరా" అని ఆజ్ఞాపించాడు హనుమయ్య.

తన్ని కూడా కట్టించుకున్న హనుమయ్య ఎలుగెత్తి అధికారికి చెప్పుకున్నాడు.- "కొట్టండయ్యా! నన్నుకూడా కొట్టండయ్యా! నన్ను కూడా కొట్టండయ్యా! ఒంటిపూట గంజితో బతుకుతున్న ఆ రైతుల్తో నేనూ సమానమేనయ్యా! అయ్యా! మాదగ్గర డబ్బుల్లేవు. కాని, దెబ్బలకు సిద్ధమేనయ్యా!"

అధికారి దిగ్గున లేచి ఈ సంవత్సరానికి శిస్తు మాఫీ చేయిస్తానని వెళ్ళిపోయాడు.❋